క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని మఠంపల్లి బైపాస్ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు ఎత్తుతున్నందున శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రెడ్డి బజార్, అంబేద్కర్ కాలనీ, మఠంపల్లి బైపాస్ రోడ్డు, లక్కవరం రోడ్డు, అనుములగూడెం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో..

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ స్తంభాల మార్పులో భాగంగా జాన్‌పహాడ్ రోడ్డులో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పండ్ల తోటల రైతులను ఆదుకోవాలి

నడిగూడెం : ఇటీవల కురిసిన వర్షాలు, భారీ ఈదురుగాలులకు నష్టపోయిన పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా పంట చేతికొచ్చే దశలో ఈదురుగాలులకు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో మామిడి తోటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా వీరబాబు



వీరబాబుకు నియామకపత్రం అందజేస్తున్న కాటమయ్య

హుజూర్‌నగర్‌రూరల్ : ఎమ్మార్పీఎస్ గోపాలపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా పిడమర్తి వీరబాబు నియమితులయ్యారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దపంగు కాటమయ్య.. వీరబాబుకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లేష్, ప్రభు, వెంకటేశ్వర్లు, శ్రీను, రాజేష్, నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



బేతవోలు రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న గుంతలు

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు రోడ్డు వెంట గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. చిలుకూరు నుంచి బేతవోలు రోడ్డు వెంట నాలుగు కిలోమీటర్ల పరిధిలో సుమారుగా 15కు పైగా గుంతలు ఉన్నాయి. నెల రోజుల క్రితం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది వైర్ల మరమ్మతుల నిమిత్తం గుంతలు తీసి పూడ్చకుండా వదిలేశారు. అదేవిధంగా హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు మరికొన్ని గుంతలు తీశారు. అసలే రోడ్డు ఇరుకుగా ఉంది. దానికి తోడు రోడ్డు వెంట గుంతలు ఉండడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే రోడ్డు కిందకు దిగే క్రమంలో వాహనాలు గుంతలో పడితే ప్రాణాలు గల్లంతు కావడం ఖాయమని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు వెంట ఉన్న గుంతలను పూడ్చివేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల క్రాస్‌రోడ్డు వద్ద విత్తనాల విక్రయ దుకాణాలను వ్యవసాయ శాఖ తిమ్మాపురం క్లస్టర్ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దుకాణాల యజమానులు రాజశేఖర్, లింగరాజు, జానయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బావులు.. చరిత్రకు సాక్ష్యాలు



నడిగూడెంలో వందేళ్ల క్రితం నిర్మించిన మూల బావి



నడిగూడెంలో వందేళ్ల క్రితం నిర్మించిన నడి బావి

- దాదాపు వందేళ్ల క్రితం వెంకటరంగారావు పాలనలో తవ్వకం
- పూర్తిగా రాతితో నిర్మాణం
- ఆరు బావుల్లో శిథిలావస్థకు చేరినవి.. నాలుగు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలో దాదాపు వందేళ్ల క్రితం జమీందారు రాజానాయిని వెంకటరంగారావు పాలనలో నిర్మించిన బావులు ప్రస్తుతం చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్నాయి. నాటి మునగాల పరగణాకు పాలనా కేంద్రం నడిగూడెం. అయితే ఆనాడు మునగాల పరగణా కింద ఉన్న 24 గ్రామాలను వెంకటరంగారావు పాలించేవారు. ఆయన వ్యవసాయ భూముల్లో ఉద్యానవన పంటల సాగుకు, గ్రామస్తులకు తాగు నీటి కోసం నడిగూడెం మండల కేంద్రంలో ఆరు బావులు తవ్వించారు. వాటిని పూర్తిగా రాతితో నిర్మించి మెట్లను కూడా ఏర్పాటు చేయించారు. అయితే వాటిలో రెండు బావులు నేటికీ చెక్కు చెదరకుండా చారిత్రాత్మకంగా ఉన్నాయి. కాలానుగుణంగా నాలుగు బావులు శిథిలావస్థకు చేరాయి. కాగా, మండల కేంద్రం సమీపంలోని చిన్న తోటలోని మూలప్రాంతంలో ఉన్న బావి, శివాలయం వద్ద ఉన్న దేవుని బావి మాత్రం నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఈ బావులను కింది నుంచి పైవరకు రాతితో కట్టించారు. పై భాగాన గోడను డంగు సున్నంతో నిర్మించారు. అలాగే బావుల్లోకి దిగే చోట ప్రవేశ ద్వారం కూడా రాతి కట్టడమే. నాడు ఈ బావుల్లో నీటిని మోట పద్ధతిలో తోడి పొలాలకు నీరు పెట్టేవారు. మండు వేసవిలో సైతం బావిలో నీరు నిండుగా ఉంటున్నాయి. ఈ బావిని నేడు మూల బావిగా, అలాగే అదే చిన్న తోటలో ఉన్న బావిని నడి బావిగా, శివాలయం వద్ద ఉన్న బావిని దేవుని బావిగా పిలుస్తుంటారు. గ్రామంలో గల బావులను వివిధ రకాల పేర్లతో పిలుస్తుంటారు.

మోట పద్ధతిలో పంటలకు నీరు పెట్టేవారు



నా చిన్న నాటి రోజుల్లో రాజావారి తోటలో వ్యవసాయ బావుల నుంచి ఎద్దులు, ఆవుల సాయంతో మోట పద్ధతిలో నీటిని తోడి పంటలకు అందించేవారు. నాడు కాలువలు కూడా రాతి కట్టడం కావడంతో నీరు కూడా వృథా కాకపోయేది. బావుల్లో పుష్కలంగా నీరు ఉండేది. పంటలు కూడా బాగా పండేవి.

– కన్నెబోయిన అచ్చయ్య, నడిగూడెం

బావులకు మరమ్మతులు చేపట్టాలి



మునగాల పరగణాకు ఎంతో చరిత్ర ఉన్నది. అలాంటి చారిత్రాత్మక పరగణాకు నడిగూడెం పాలనా కేంద్రం. నడిగూడెంలోని వందేళ్ల నాటి బావులకు ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి, భావితరాలకు బావుల చరిత్రలను తెలియచేయాలి.

– జలగం శివ, నడిగూడెం

గుంతలమయంగా రోడ్లు



అధ్వానంగా ఉన్న కూడలి- రావికుంటతండా వెళ్లే రోడ్డు

- ఇరుపక్కలా ఆక్రమణకు గురై ఇరుకుగా మారిన దారులు
- ప్రమాదకరంగా మూలమలుపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మోతె : మండలంలో పలు లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మోతె మండల కేంద్రం నుంచి సిరికొండ, కాచిగూడెం, రావిపహాడ్, మామిళ్లగూడెం, విభళాపురం, రాంపురంతండా, బుర్కచర్ల, హుస్సేన్‌బాద్, గోల్‌తండా, సర్వారం, రావికుంటతండా, రాందాస్‌తండా, కూడలి గ్రామాలకు వెళ్లే రోడ్లు ఇరుపక్కల ఆక్రమణకు గురవడంతో ఇరుకుగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్లలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్లపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. విభళాపురం నుంచి కరక్కాయలగూడెం, ఉర్లుగొండ గ్రామాలకు వెళ్లే రోడ్డు సైతం కబ్జాకు గురై ఇరుకుగా మారింది. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాల డ్రైవర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంపురంతండా నుంచి బుర్కచర్లకు వెళ్లే రోడ్డులో ప్రమాదకరమైన మూలమలుపులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, రోడ్ల ఇరుపక్కల స్థలం కబ్జాపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లకు ఇరుపక్కలా కంపచెట్లను తొలగించి మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని వేడుకుంటున్నారు.

కంపచెట్లను తొలగించాలి



మండలంలో లింకు రోడ్ల వెంట చెట్లు దట్టంగా పెరిగి దారులను కమ్మేస్తున్నాయి. దీంతో మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు రోడ్లు ఆక్రమణకు గురై ఇరుకుగా మారాయి. అధికారులు స్పందించి రోడ్ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలి. రోడ్లకు ఇరువైపులా హరితహారం మొక్కలను 10 అడుగుల దూరంలో నాటించాలి.

– కాంపాటి శ్రీను, సిరికొండ

చినుకు పడితే బురదమయం



చిత్తడిగా మారిన వేణుగోపాలపురం రోడ్డు

నడిగూడెం : మండల పరిధిలోని వీరాంజనేయనగర్ నుంచి వేణుగోపాలపురంనకు వెళ్లే రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. పలు చోట్ల రోడ్డు బాగా దెబ్బతిన్నది. లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు మీదుగా అనేక మంది ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని, పార్టీ నాయకులను అంగట్లో బీజేపీకి అమ్మాడని, రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు అయ్యిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని తెలిపారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో 51,094ఓట్లు, పార్లమెంటు ఎన్నికల్లో 63,409 ఓట్ల రికార్డు మెజార్టీ వచ్చిందని అన్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు. త్వరలో జరిగే పంచాయతీ, సింగిల్‌విండో, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలంతా కష్టపడి పని చేయాలని కోరారు. త్వరలోనే తిరుమలగిరిలో జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తిరుమలగిరి, మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు శాగంటి అనసూయరాములు, గుర్రం కవిత, పాలకుర్తి రాజయ్య, పాలెపు చంద్రశేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, పార్టీ మండల అధ్యక్షుడు లింగయ్య, సుధాకర్, సుంకరి జనార్దన్, పేరాల వీరేష్, జమ్మిలాల్, రాపాక సోమేష్, నర్సింహారెడ్డి, వీరమల్లు, పేరాల వీరేష్, కందుకూరి లక్ష్మయ్య, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు సుధాకర్ మృతికి సంతాపం

అర్వపల్లి : తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక సారధి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్(డప్పు సుధాకర్) అకాల మృతికి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల సంఘం జిల్లా నాయకుడు మేడిపల్లి వేణు శుక్రవారం సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఆటా-పాటలతో ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు.

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జాతీయస్థాయి టెన్నిస్ క్రీడాకారిణి రేఖ

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్ మడ్డి పద్మలు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడారు. తమ గ్రామం నుంచే కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎంపీగా గెలిచినందున మొట్టమొదటగా తమ గ్రామానికే రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు. గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మద్దిరాల : రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలోని అన్నమయ్య ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ షాపును తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. ఎరువుల స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు తీసుకున్న రైతులకు వెంటనే రశీదులు అందజేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ పసుపులేటి మధునాయుడు, ఫర్టిలైజర్ షాపు యజమానులు తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ టి.లక్ష్మీనారాయణ

హుజూర్‌నగర్ : మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ టి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు మిషన్ భగీరథ నీటి సరఫరాపై జరిపే ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అజీజ్, వెంకటేశ్వరరావు, వివిధ మండలాల ఎంపీడీలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన



కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శత నామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి



నేరేడుచర్లలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓ, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారులు రాంబాబు, జనార్దన్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ చత్రునాయక్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేరేడుచర్లలో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా, కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తవి.రమేష్, దీప్లానాయక్, అనసూర్య, ఉపాధ్యాయులు పి.పద్మావతి, సైదులు, రషీద్, శారీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, ప్రభాకర్‌రెడ్డి, మాధవి, భవాని, స్రవంతి, శ్రీనివాస్‌రావు, రవి, కృష్ణప్రసాద్, శ్రీధర్, మజీదబేగం, ప్రసాద్, మాదురి, విజయ, అన్నపూర్ణ, భూదేవి ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ చత్రునాయక్, జిల్లా సెక్టోరియల్ అధికారి యర్రంశెట్టి రాంబాబు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు జూన్ 12న అందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మానస, షరీఫ్, సుశీల, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

చిలుకూరు : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కొండా వెంకయ్య కోరారు. శుక్రవారం చిలుకూరు మండల పరిధిలోని రామ్‌నగర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వీరబాబు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గరిడేపల్లిలో..



చిలుకూరు : రామ్‌నగర్‌లో..

బంగారు మైసమ్మ ఆలయానికి రూ.26.72 లక్షల ఆదాయం

మిర్యాలగూడ : మండలంలోని కల్లెపల్లి గ్రామంలో బంగారు మైసమ్మతల్లి దేవస్థానంలో వివిధ పూజా సామగ్రి విక్రయించుకునేందుకు నిర్వహించిన వేలంలో రూ.26.72లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో మిర్యాలగూడ డివిజన్ పరిశీలకుడు ఈ.రమేష్ సమక్షంలో వేలం నిర్వహించగా కొబ్బరికాయలు అమ్ముకోవడానికి రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ పున్నానాయక్ రూ.17.80లక్షలకు దక్కించుకోగా పూలు విక్రయించడానికి మాలోతు బీమానాయక్ రూ.2.22లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయించడానికి మాలోతు రవినాయక్ రూ.6.70లక్షలకు దక్కించుకున్నారని, దీంతో ఆలయానికి వేలం ద్వారా రూ.26.72లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా దున్నపోతులు సమకూర్చుకునే హక్కు, కొబ్బరిచిప్పలు సేకరించుకునే హక్కుతోపాటు తలనీలాలు సేకరించుకునే హక్కులకు ఏడాది కంటే తక్కువ పాట వచ్చినందునా ఆ వేలంను ఈనెల 14కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కాగా వేలం సందర్భంగా ఆలయం వద్ద ఎస్ఐ రవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీమా, సోమమ్మ, జానకిరాములు, మాలోతు జనార్దన్, శారదపాచ్చునాయక్, నెహ్రూనాయక్, వెంకటేశ్వర్లు, రామ్మోహన్, కోటేష్, ఎర్రనాయక్, హజ్మీరా, లింగానాయక్, మేఘా, వాగ్యా, ధీరావత్ లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

మిర్యాలగూడటౌన్ : మున్సిపాలిటీలో శుక్రవారం సమాచార హక్కు కార్యకర్తలు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ రాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 2 (జే)సమాచార హక్కు ప్రకారం ప్రతి ఒక్క పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ నిర్వహించవచ్చాన్నరు. అవసరమైన సమాచారాన్ని ధ్రువీకరించుకోని తీసుకునే అవకాశం కూడా ఉంటుందని అన్నారు.

రోడ్ల వెంటే వ్యర్థాల పారబోత

- దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు
- డంపింగ్ యార్డులకు తరలింపులో పంచాయతీల సిబ్బంది నిర్లక్ష్యం
- ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!



మేళ్లచెరువు నుంచి కోదాడ వెళ్లే రోడ్డు వెంట పోసిన వ్యర్థాలు

మేళ్లచెరువు : మండలంలోని పలు గ్రామాల్లో చెత్తా చెదారం రోడ్ల వెంటే దర్శనమిస్తోంది. దుకాణాదారులు, ప్రజలు రోడ్ల వెంటే ఇష్టానుసారంగా వ్యర్థాలు పారబోస్తున్నారు. చెత్త, వ్యర్థాలను డంపింగ్‌యార్డులకు తరలించాల్సిన గ్రామ పంచాయతీల సిబ్బంది కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ రోడ్ల వెంట చెత్తను తగులబెడుతుండడంతో పొగతో ఇబ్బందులు తలెత్తుతుండడంతో పాటు హరితహారం చెట్లు తగులబడడం జరుగుతున్నాయి. ప్రత్యే అధికారుల పాలనలో పారిశుద్ధ్యం మరింత అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా హుజూర్‌నగర్ రోడ్డు, రేవూరు, చింతలపాలెం, వేపలమాధవరం గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట ఖాళీ కొబ్బరి బోండాలు, తదితర వ్యర్థాలు వేస్తుండడంతో అటుగా ప్రయాణం చేస్తే ముక్కు మూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు అంటున్నారు. అంతేకాకుండా రోడ్డు పక్కన గల దుకాణాలు, ఇళ్ల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వ్యర్థాలను రోడ్డు ప్రక్కన వేయవద్దని అనేకసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తను అక్కడివరకు తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల్లో పడేసిన చెత్త రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ వేసి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. దీంతో డంపింగ్ యార్డులు ఖాళీగా ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డులను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.